

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**దినకరా, శుభకరా, దేవా, దీనాధారా, తిమిర సంహార**

**దినకరా, శుభకరా**

హిందీ సినిమా 'బాభీకీ చూడియా' లోని ఉషోదయగీతం 'జ్యోతి కలశ్ ఛల్కే' అతి మృదువుగా, మధురంగా ఉంటుంది. గేయరచయిత ఉషోదయంలోని ఆధ్యాత్మకతను ప్రకటిస్తూ అత్యంత అద్భుతంగా, సృజనాత్మకంగా భావాలను వ్యక్తం చేస్తాడు. ఆ పాట వింటూంటే మనసు రెక్కలను కట్టుకుని ఆనంద తీరాలలో విహరిస్తుంది. ఆ పాట వింటూండటం తప్ప మరేమీ అవసరంలేదనిపిస్తుంది. కళద్వారా వ్యక్తికి బ్రహ్మానందానుభూతిని కలిగించటమనే దానికి అతి చక్కని ఉదాహరణ 'జ్యోతి కలశ్ ఛల్కే' పాట.

'వినాయక చవితి' సినిమాలో సుప్రభాత సమయంలో సూర్యభగవానుడిని స్తుతిస్తూ పాడే 'దినకరా శుభకరా' పాట జ్యోతి కలశ్ ఛల్కే పాటకు పూర్తిగా భిన్నమైనది. సినిమాలో సందర్భాన్ని బట్టి పాటలను సృజిస్తారు. సందర్భోచితంగా గేయరచన, బాణీ సృజనలుంటాయి. 'జ్యోతికలశ్ ఛల్కే' పాట సందర్భం చాలా మృదువయినది. గృహిణి ఉదయమే లేచి ఇంటిపనులు చేసే సందర్భంలో వచ్చే గీతం అది. ఆమె ఆ ఇంటికి ప్రాణం వంటిదని నిరూపిస్తూ మరిదితో ఆమె అనుబంధాన్ని తల్లీ కొడుకుల వంటి సంబంధం అని నిరూపించేందుకు పాటను దర్శకుడు సృజనాత్మకంగా వాడుకున్నాడు. ఆ సందర్భంలో పాటను ఆధ్యాత్మక స్థాయికి ఎదిగింపచేయటం గేయ రచయిత, సంగీత దర్శకుల ప్రతిభకు నిదర్శనం. అదీ సందర్భం చెడకుండా సాధించటం వారి గొప్పతనం.

'దినకర శుభకర' పాట సందర్భం సత్రాజిత్తు సూర్యోపాసన చేయటం సూర్యభగవానుడిని తన భక్తితో మెప్పించి శ్యమంతకమణిని సాధించిన మహా భక్తుడు సత్రాజిత్తు. అలాంటి మహాభక్తుడు పాడే భక్తిగీతం మాములుగా ఉండే వీలు లేదు. భక్తి ప్రాధాన్యం ఉండాలి. భావ గాంభీర్యం ఉండాలి. భాష ప్రౌఢమై ఉండాలి. శాస్త్రీయ సంగీత ఆధారం ఉన్న పాట సరళంగా ఉండి సామాన్య ప్రేక్షకుడిని సైతం ఉర్రూతలూగించాలి. రాగాలు, దీర్ఘాలతో ప్రజలకు  విసుగు కలిగిస్తే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి స్థాయి తగ్గకుండా అందరినీ అలరించాలి.

సీనియర్ సముద్రాల రచించిన ఈ పాటలో పెద్ద పెద్ద పదాలు లేవు. కఠినమైన సమాసాలు లేవు. ప్రబంధ పద బంధాలు లేవు. చాలా సరళమైన అందరికీ అందుబాటులో ఉండే పదాలు మాత్రమే పాటలో వాడేడు గేయ రచయిత. ఇందులో అర్థంలేని పదాలే లేవు. ఏ మాత్రం భాషతో పరిచయం ఉన్నా సులభంగా అర్థం అయిపోతుంది పాట.

పతిత పావన మంగళదాతా, పాప సంతాప లోకహితా
బ్రహ్మ విష్ణు పరమేశ్వర రూప, వివిధ వేద విజ్ఞాన నిధాన
వినత లోక పరిపాలక భాస్కర, దినకరా శుభకరా!

అత్యంత సులభంగా, సరళంగా ఉండే ఈ పదాలు రాగంలో ఒదిగేసరికి మామూలుగా కన్నా అధికమైన పవిత్రతను సంతరించుకుంటాయి. ఒక ప్రౌఢత్వంతో అలరారుతాయి. దాంతో వినేవారి మనస్సు మాములు స్థానుంచి కొన్ని మెట్లెక్కుతుంది. ఘంటసాల స్వరతరంగాలలో నృత్యమాడుతూ శ్రోత వీనులని చేరిన ఈ పదాలు అత్యంత పవిత్రమై సూర్యకిరణాల స్పర్శతో కరిగిన మంచు బిందువులతో స్నానమాడిన పూరేకుల స్వచ్ఛతతో తళతళలాడతాయి. దాంతో పాట ఒక అత్యద్భుతమైన 'అర్చన' గీతంలా రూపాంతరం చెందుతుంది. మామూలు సినిమా స్థాయిని దాటి నిత్య జీవితంలో భగవదార్చనలో స్మరించే మంత్రంలా మహిమాన్వితమైన భావనను కలిగిస్తుంది.

ఇది మన సినీకళాకారుల గొప్పతనం. సందర్భానికి తగ్గ సాహిత్యాన్ని, బాణీని కూరుస్తూనే, సందర్భాన్ని, సినీ పరిధిని దాటి పాటను నిత్యజీవితంలోనూ భాగమయ్యే రీతిలో సృజించటం ఒక అత్యద్భుతమైన సృజనాత్మక ప్రక్రియ. ఇది అందరు కళాకారులకు సాధ్యమయ్యే పనికాదు. అందుకే సూర్యోదయాన్ని వర్ణిస్తూ ఎన్నో సినీగీతాలు చలామణిలో ఉన్నా 'జ్యోతి కలశ్ ఛల్‌కే ', 'దినకరా, శుభకరా' పాటలు మాత్రం తమదైన పవిత్రమైన భావనతో ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈ రెండు పాటలు రెండు విభిన్నమైన శాస్త్రీయ సంగీత ధోరణులకు అద్దం పడతాయి.

భారతీయ సంప్రదాయంలో సంగీతం సరస్వతి . వేదజనితం. సంగీతమనేది యోగలాగా, భక్తిలాగా, జ్ఞానంలాగా భగవంతుడిని చేరే ఒక మార్గం. కానీ భారతదేశంలో ఉత్తరాదిన ఒకరకమైన సంగీతం, దక్షిణాదిన మరోరకమైన సంగీతం అమలులో ఉన్నాయి. ఉత్తరాది సంగీతాన్ని హిందుస్తానీ సంగీతంగానూ, దక్షిణాది సంగీతాన్ని కర్ణాటక సంగీతంగానూ సూచిస్తారు. గమనిస్తే, సంగీతం వేదజనితమైనప్పుడు, దేశమంతా వేదం, వేదానికి అనుబంధాలయి, వేదం నుంచి జనించిన శాస్త్రాలన్నీ ఒకేరూపంలో ప్రచారంలో ఉన్నపుడు సంగీతంలో రెండు భిన్నమైన సంప్రదాయాలు ఉత్పన్నమవటం ఆలోచనలను కలిగిస్తుంది. ఒక సిద్ధాంతం ప్రకారం ఆరంభంలో దేశమంతా ఒకేరకమైన సంగీత పద్దతి అమలులో ఉండేది. దేశం నలుమూలలా వేదజనితమైన సంగీతం ఒకేరకంగా గానం చేసేవారు. కానీ, రాను, రాను పరిస్థితుల ప్రభావం సంగీతంపై పడింది. ఉత్తరాది ప్రాంతాలు గురైనంతగా విదేశీ దురాక్రమణల ప్రభావానికి దక్షిణాది ప్రాంతాలు గురికాలేదు. దాంతో సంగీతానికి 'బీజం' ఒకటే అయినా, పద్ధతులు ఒకటే అయినా ప్రక్రియల స్వరూపం మారింది. 12వ శతాబ్దంలో శారంగదేవుడు రచించిన 'సంగీత రత్నాకరము' ఉత్తరాది సంగీతంలా భావించే హిందుస్తానీ సంగీతానికి మూలంగా పరిచయమవుతోంది. ఇస్లామీయుల ప్రభావంతో ఈ సంగీతం పలువిభిన్నమైన రూపాలు ధరించింది. పలు ఘరానాలు ఏర్పడ్డాయి. పలురకాల పాటలు పాడే పద్ధతులు ఏర్పడ్డాయి. అయితే, ఇస్లామీయుల కాలంలో అనేక భారతీయ కళాకారులు మతం మారాల్సి వచ్చింది. తప్పనిసరి పరిస్థితులలో వారు మతం మారినా తమ కళను మరచిపోలేదు. దాన్ని పాలకులను రంజించే రీతిలో రూపాంతరం చెందించారంతే. అంటే, భగవదార్చన కోసం నిర్మితమైన కళను అధికారులకు ఆనందం కలిగించే రీతిలో రూపాంతరం చెందించారన్నమాట. రాజ్య సభలోనూ, పెద్దల కూటములలోనూ అందరినీ మెప్పించే గానంగానూ, నృత్యగీతాలుగానూ, లలితగీతాలుగానూ తెరపైకి వచ్చిందన్నమాట. ఇప్పటికీ శాస్త్రీయ సంగీతరాగాలలో భగవదార్చన అంతర్భాగంగా ఉన్నప్పటికీ, రాధాకృష్ణుల రాసలీల, గోపికల కేళీ విలాసాలు ప్రియుడి కోసం ఎదురుచూపులు, పలవరింతలు వంటివి శాస్త్రీయ సంగీతంలో భాగమయ్యాయి. శాస్త్రీయ సంగీత కళాకారులయిన ఇస్లామీయులు కృష్ణ మందిరంలో సాధన చేస్తారు. కృష్ణ భజన గీతాలతో తమ కార్యక్రమాలను ఆరంభిస్తారు. కృష్ణ భజన చేయటం వారి సంప్రదాయం. వారి వ్యక్తిగత మతాచరణకూ కళాభినివేశానికీ నడుమ ఎలాంటి సంఘర్షణ ఉండదు. కానీ మౌలికంగా జనరంజకంగా ఉండటానికి ప్రాధాన్యం ఇవ్వటం వల్ల హిందుస్థానీ సంగీతంలో లాలిత్యము, మృదుత్వము, శృంగారమూ ప్రధానంగా కనిపిస్తాయి. అలరిస్తాయి.

కర్ణాటక సంగీతం, ఉత్తరాది సంగీతంలా విదేశీ ప్రభావానికి అంతగా గురికాలేదు. దాంతో ప్రధానంగా కర్ణాటక సంగీతం స్వచ్ఛంగా ఉండి అధికంగా దేవతార్చనకే అంకితం అయింది. ఇది ఈ విభిన్న సంగీత ప్రక్రియల ఆధారంగా సృజించే సినీగీతాలపై కూడా ప్రభావం చూపించింది. దీనికితోడు అటు హిందీ, పార్సీ ఇటు తెలుగు భాషల నడుమ ఉన్న తేడాలు కూడా పాటల స్వరూపంపై నిర్దిష్టమైన ప్రభావాన్ని

చూపాయి. కర్ణాటక సంగీతం కానీ సంగీత ఆధారిత నృత్యం కానీ సామాన్యులను అలరించటంకన్నా భగవదంకితంగా భావించి రంజింపచేయటం పైనే దృష్టి పెట్టటం వల్ల, హిందుస్తానీ సంగీతం నృత్యగీతాలకు, ప్రేమ పాటలకు ప్రాధాన్యం ఇచ్చి సభాసదులను మెప్పించటానికి ప్రాధాన్యం ఇవ్వటం వల్లకూడా తేడాలు స్పష్టంగా తెలుస్తాయి.

మన్ ఆనంద్ ఆనంద్ ఛాయో
మిర్యో గగన్ ఘన్ అంధకార్
అఖియన్ మే జబ్ సూరజ్ ఆయో
మన్ ఆనంద్ ఆనంద్ ఛాయో

'విజేత ' సినిమాలో అజిత్ వర్మ సంగీత దర్శకత్వంలో వసంత్ దేవ్ రచించిన ఈ పాటను ఆశాభోంస్లే, పండిత సత్యశీతల్ దేశ్‌పాండేలు అత్యద్భుతంగా, అతి పవిత్రంగా గానం చేశారు. సూర్య కిరణం ఆవిష్కృతమవటంతోటే ఆకాశంలోని దట్టమైన చీకటి అంతమయింది. మనసు ఆనందమయింది అంటూ ఆరంభమవుతుంది పాట. పాటలోని పదాల్లో లేని పవిత్రత రాగంలోనూ, గాయకుల గానంలోనూ ప్రస్ఫుటమవుతుంది.

ఉరి కిరణ్ కీ లహర్ సునహరీ
జైసే పావన్ గంగాజల్
అర్పణ్ కే పల్ హర్ సింగార్ మధు
గీత్ సిందూరీ గాయో

పావన గంగాజల తరంగంలా కిరణాల అలలు ఎగసి పడ్డాయి. సముద్రంలో అలలు ఎగసి పడినట్టు ఆకాశంలో సూర్యకిరణాలు బంగారు రంగుతో ఎగసిపడ్డాయి. భగవదార్పణకోసం మధురమైన గీతాన్ని గానం చేస్తున్నాయి. అత్యంత సరళమైన పదాలతో కళ్ళముందు సుందరమైన దృశ్యాన్ని చిత్రిస్తున్నాడు గేయ రచయిత.

మన్ సరోవర్ మగన్ కంపన్
నభదర్పణ్ కీ ఝూంకీ
తా మే అబికల్ అధఖుల్ లోచన్
ప్రాణ్ హంస ఉతర్ ఆయే.

'నభదర్పణ్' 'అధఖుల్' వంటి చక్కని పద ప్రయోగాలతో అతిక్లిష్టమైన ఆధ్యాత్మకపుటాలోచనను అతి సుందరంగా ప్రదర్శిస్తుందీపాట. మనిషి మనసును ఆకాశంతో పోల్చటం పరిపాటి. సరస్సు నిర్మలంగా ఉన్నప్పుడు ఆకాశం నీటిలో ప్రతిబింబించి ఆకాశం క్రిందకు దిగి వచ్చిందా అన్న భ్రమను కలిగిస్తుంది. ఆకాశం దర్పణమై భువిమీది సరస్సును ప్రతిబింబిస్తున్న భావన కలిగిస్తుంది. ఇక్కడ కవి ఆ భావననే వర్ణిస్తున్నాడు. ఇలాంటి అత్యద్భుతమైన ప్రశాంత స్థితిలో అర్ధనిమీలిత నేత్రాలతో ప్రాణం పోసుకుంటుంది జగతి... అది చూసి మనసు ఆనందమయమైపోతుంది. అత్యంత సుందరమైన రీతిలో 'సూర్యుడు తన కిరణాలలో సమస్త జగత్తు ప్రాణాలను ధరించి ఉదయిస్తున్నాడన్న' ఉపనిషత్ భావనను కవి ప్రదర్శించాడు.

ఈ పాట చిత్రీకరణ కూడా గొప్పగా ఉంటుంది. అందంగా, ప్రశాంతత ప్రాణం పోసుకున్నట్టుగా ఉన్న నటి రేఖ తెరపై అర్ధనిమీలిత నేత్రాలతో పరవశమై ఆనందానుభూతిని ప్రేక్షకులకు చేరువచేస్తూ గానం చేస్తూంటుంది. చివరలో 'ప్రాణ్, హంస ఉతర్ అయే' అన్నప్పుడు ఆమె ఎదురు చూస్తున్న ఆమె ప్రాణం ఆమె కొడుకు ఇంటికి వస్తాడు.

చక్కని బాణీ, చక్కని సాహిత్యం, చక్కని గానం, చక్కని చిత్రీకరణ తోడయితే సినిమా పాట కూడా వ్యక్తిలోని ఆధ్యాత్మక భావనలను రగిలించి ఉత్తమస్థాయి కలిగించి ఉన్నతుడిని చేస్తుందనేందుకు చక్కటి ఉదాహరణ ఈ పాట.

అయితే ఉదయ సమయంలోని ఆనందాన్ని పలు విభిన్నమైన రీతులలో చేరువ చేసి ఆనందం కలిగించే పాట 'బావర్చి ' సినిమాలోని 'భోర్ ఆయీ గయా అంధియారా!'

'బావర్చి ' సినిమా సంధి దశలోని సినిమా. కమర్షియల్ సినిమాలకు భిన్నంగా 'ఆర్ట్' ఫిల్మ్ రంగప్రవేశం చేస్తున్న తరుణంలో హిందీ సినీరంగంలో 'మధ్యతరగతి' మనస్తత్వాలను ప్రదర్శించే సినిమాలు రెండు రకాల సినిమాల నడుమ వారధిలా నిలిచాయి. 'బావర్చి' సినిమాలో ఒకరినొకరు పట్టించుకోని కుటుంబ సభ్యుల నడుమ ఓ వంటవాడు ప్రవేశిస్తాడు. అతని ప్రవేశంతో ఇంటి వాతావరణం మారిపోతుంది. ఉదయాన్నే అంట్లు తోముతూండటంతో పాట ప్రారంభమవుతుంది.

భోర్ ఆయీ గయా అంధియారా
సారే జగ్ మే హువా ఉజియారా
నాచే ఝూమే యే మన్ మత్వారా

కైఫీ అజ్మీ కవిత అత్యంత సున్నితంగా భావ ప్రదర్శన చేస్తుంది. సూర్యోదయం అవటంతోటే చీకటి పారిపోయింది. జగతి వెలుతురుమయం అయింది. మనసు ఆనందంతో చిందులు వేసింది. ఈ పాట వింటుంటే, మనస్సులో ఒక భావన మెదులుతుంది. ఈ సృష్టిలో సూర్యోదయాన్ని అత్యంత ఆనందంగా ఆహ్వానించలేని ఏకైక జీవి మనిషి అనిపిస్తుంది. ఇతర జీవులన్నీ ప్రకృతితో మమేకమై బ్రతుకుతాయి. వాటి దినచర్యలు సూర్యుడితో ముడిపడి ఉంటాయి. సూర్యోదయ సూచనగా పక్షులు కలకలరావాలు చేస్తాయి. జీవులు సంబరంతో అటూ ఇటూ పరుగులు పెడతాయి. కానీ సూర్యోదయ సౌందర్యాన్ని మనస్సు నిండా నింపుకుని, ఆనందించి, తన సృజనాత్మకతకు రంగులు దిద్దుకుని ప్రతిసృష్టి చేయగలిగిన మనిషి మాత్రం ఆ సమయానికి నిద్రలేవడు. లేచినా ఏవేవో చిరాకుల్లో ఉంటాడు. పనుల్లో ఉంటాడు. అందుకే 'నాచే ఝూమే యే మన్ మత్వారా' అనగానే, సూర్యోదయానికి ఆనందించి, నర్తించే సమయ లేమి ' భుజాలు తడుముకునేట్టు చేస్తుంది. హృదయం ఉంది. కానీ సమయంలేదు.

ధర్తీ భీ ఝూమే బగియాభిఝూమే
భవ్రా మచల్ కె కలియోంకొ చూమె
నన్ హి కిరణ్ ముస్కాయే
లాగే నీలా గగన్ బడా ప్యారా బడా న్యారా

సూర్యోదయంతో భూమి సంతోషించింది. పూదోటలు ఆనందించాయి. తేనెటీగలు స్పందించి పూలను తాకాయి. బాలకిరణాలు సంతోషంగా నవ్వుతున్నాయి. నీలగగనం అందంగా కనిపించింది.

ఇక్కడ పాట బాణీ మారుతుంది. భావం మారుతుంది

దిన్ యే సందేశా లేకర్, పూరబ్ సే ఆతాహై
మెహనత్ జో బాంటే వోహీ, ఫల్ మిల్కే ఖాతాహై
మజే ఉడావో మిల్‌కే, ఖుషీ మనావో మిల్‌కే
నయా బహార్ ఆయా, దేఖ్ ఫూల్ ఖిలాయో మిల్‌కే
ఎక్ దూజే సోచోగేతో మౌజ్ కరోగే

హస్తె గాతె దిన్ బీతెగా మస్త్ రహోగే

దేతాహై జిత్నా కోయీ, ఉత్నా హీ పాతాహై

ఉదయం మనుషుల కోసం సందేశాన్ని మోసుకు వస్తోంది. కలసి కష్టపడి పనిచేసేవాడికే ఫలితం లభిస్తుంది. అందరూ కలసి ఆనందించాలి. సంబరాలు చేసుకోవాలి. పూలల్లా కలసి వికసించాలి. ఒకరి గురించి ఒకరు ఆలోచించినప్పుడే అందరూ కలసి నవ్వుతూ, తుళ్లుతూ ఆనందంగా జీవిస్తారు. సమిష్టి జీవన సౌందర్యాన్ని సుందరంగా ప్రదర్శిస్తాయీ పదాలు. ఎవరెంత ఇస్తే, అంతే పొందుతారు. ఇది సూర్యోదయం తీసుకు వచ్చే సందేశం.

అంతే కాదు. దేఖో కెహతాహై తుం సే సవేరా

ఛోడోభీయే తేరామేరా

ఫూటీ గగరీ లియే ఫిర్ రహేహై

మిల్‌కె నహీ పీతే థే జో పానీ

జోభీ కర్‌నా హై ఆజ్ కర్‌లో

యాద్ రఖో జోగికె యే బాణీ

కె పలట్ తీ నహీహై సమయ్ కి యే ధారా

ఈ పంక్తులలో ఉదయం మోసుకు వచ్చిన సందేశం రూపంలో కవి జీవితతత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. 'నీది నాది'అనే భావాన్ని వదలమంటోంది ఉదయం. కలసి నీరు తాగని వారు ఓటికుండని వెంట తీసుకుని తిరుగుతున్నట్టు. వెనక్కి తిరిగిరానిది సమయం కాబట్టి ఈరోజు చేయాలనుకున్న పని ఈరోజే చేయమంటున్నాడు కవి.

ఇదంతా ఆ కుటుంబంలోని వృద్ధుడు చెపాడు. ఇంతలో ఆధునిక యవకుడు ఇంగ్లీషులో పాడతాడు. మాతృభాషలో పాడమనగానే

సుబహకీ కిరణే ఆయీహై

ఖుషియాహి  ఖుషియా లాయీ హై

ఆయీ పనియా భరన్ కీ బేలా

లాగా జమున కే తట్ పర్ మేలా

మిల్ కే భర్ లాయే ఆవో గగరీ

బోలే ఛన్ ఛన్ క్యా ఘుంఘురూ అకేలా

గీతం ఎన్నెన్నో మలుపులు తిరుగుతోంది. నిజానికి ఈపాట వింటూంటే ఇంత ఆనందాన్ని రోజూ ఉదయం అనుభవించగలిగీ అనుభవించలేని మానవుల దురదృష్టం, దౌర్భాగ్యాలు గుర్తుకు వచ్చి ఎంతో విషాదంగా అనిపిస్తుంది. కనీసం ఇలాంటి పాటలయినా సూర్యోదయ దర్శనానుభవంలోని ఆనందాన్ని స్ఫురింపచేసి మనసుకు ఆనందం కలిగించి దృష్టిని ఆవైపు ప్రసరింపచేస్తాయి. ఈ పాట వినటమే కాదు చూడటం కూడా ఆనందాన్ని కలిగిస్తుంది.

జేసుదాసు పాడిన హై సియత్ సినిమాలో పాట సూర్యోదయానికి సంబంధించినదే అయినా, గేయరచయిత వీలయినంతగా పదాలతో దృశ్యాలను చిత్రించాలని ప్రయత్నించినా 'బాగుంది' అనిపిస్తుంది కానీ ఇతర సూర్యోదయ గీతాలు కలిగించినంత ఆనందాన్ని, ఆధ్యాత్మిక భావనను కలిగించదు.

ధీరే ధీరే సుబహ హుయీ

జాగ్ ఉఠీ జిందగీ

పంచి చలే అంబర్ కో

మాఝి చలే సాగర్ కో

ప్యార్ క నాం జీవన్ హై

పదాలు కల్పించే దృశ్యంలో లోపం లేదు. బాణీలో లోపం లేదు. గానంలో లోపం లేదు. కానీ ఇదే 'అహిర్ భైరవ్' రాగంపై ఆధారపడి రూపొందించిన 'మన్ ఆనంద్' పాట వింటూ రెక్కలు కట్టుకుని ఆకాశానికి ఎగిరిన మనస్సు, ఈ పాట వింటూ ఆనందిస్తుంది అంతే. మెల్లమెల్లగా తెల్లవారింది. జీవితం నిదురలేచింది. పక్షి ఆకాశానికి ఎగిరింది. నౌక సాగరానికి కదిలింది. జీవితం ప్రేమమయం. ఇదీ పల్లవి సామాన్యార్థం. చరణంలో భావం కూడా ఇంత చక్కగా ఉంటుంది.

డూబ్ కె సూరజ్ ఫిర్ నిక్‌లా

సారె జహా కో నూర్ మిలా

దిల్‌కే ద్వారే తుం కొ పుకారే

ఏక్ నయీ జిందగీ

ప్రతి నిద్రనూ ఓ మరణం లాగా ప్రతి ఉదయాన్నీ ఓ జననంలాగా భావించాలని ఓ తత్వవేత్త అంటాడు. అంటే ప్రతీ ఉదయం కొత్త జీవితం ఆరంభించాలని, నిన్నటి కోపాలు, తాపాలు, పంతాలు, పట్టుదలలు లేకుండా నూతనంగా రోజును ఆరంభించాలన్న మాట. సముద్రంలో మునిగిన సూర్యుడు మళ్లీ ఉదయించాడు. ప్రపంచానికి వెలుగు లభించింది. ఒక కొత్త జీవితం ఆరంభిస్తూ హృదయద్వారాలు నిన్ను ఆహ్వానిస్తున్నాయి అంటున్నాడు కవి ఇందీవర్. సులభమైన భావం. లలితమైన పదాలు. ఇప్పుడు అర్ధమవుతుంది పాట ఎందుకని మనస్సును అంతగా స్పందింపచేయలేకపోతోందో! ఇంతవరకూ విన్న పాటలు, 'జ్యోతి కలశ్ ఛల్‌కే ' 'దినకరా శుభకరరా ' 'మనస్ ఆనంద్' 'భోర్ ఆయీ గయా అంధియారా' వంటి పాటలన్నీ సందర్భ పరిధిలో ఒదిగినా సార్వజనీన భావనలను ప్రదర్శించినవి. ఆధ్యాత్మిక భావాన్ని పొదుగున్నవి. పైగా ఈ పాటలన్నీ శాస్త్రీయ రాగాలకు అతి దగ్గరగా ఉన్నవి. వినగానే ఈ పాటలు శాస్త్రీయ సంగీత ఆధారితాలని తెలుస్తుంది. 'ధీరే ధీరే సుబహ హుయీ' పాట శాస్త్రీయ సంగీత ఆధారితం అని తెలుస్తూనే ఉన్న మిగతా పాటలకన్నా మరింతగా సరళతరం అయిన పాట. చరణాలు దాదాపుగా శాస్త్రీయ సంగీత భావనకు దూరమవుతాయి. పైగా భావం, చరణానికి వచ్చేసరికి వ్యక్తిగతమైపోతోంది. నాయకుడి హృదయ ద్వారాలు నాయికను ఆహ్వానిస్తున్నాయి. ఇదే గీతం, నాయకుడి హృదయం నాయికను ఆహ్వానిస్తున్న భావనను అంతర్లీనంగా ఉంచి భగవంతుడి కోసం పరితపిస్తున్న ఆత్మ, ఆహ్వానిస్తోందన్న భావం కలిగించగలిగి ఉంటే, కనీసం పాట స్థాయి పెరిగి ఉండేది.

కిరణోంసే దామన్ భర్ లో

ప్రీత్ సె తుం తన్ మన్ భర్‌లో

జిస్‌మే జిత్‌నీ ప్యాస్ జగీ

ఉత్‌నీ హీ ప్రీత్ మిలీ...

ఈ చరణంలో సార్వజనీనమైన భావన ఉన్నా పాట తేలిపోతుంది. కొంగులో కిరణాలను నింపుకోమని ప్రతీకాత్మకంగా అన్నా, ప్రేమతో తనవును, మనస్సును నింపుకోమన్నా, ఎవరికెంత ప్రేమ పిపాస అయితే అంత ప్రేమ లభిస్తుందని చెప్పినా, పాట చక్కగా, గొప్పగా అనిపిస్తుంది కానీ, 'అద్భుతం' అన్న భావన రాదు. శాస్త్రీయ సంగీతం నుంచి పాటను పాపులర్ బాణీలోనే దింపటం పాటను తేలికచేస్తుంది.

అయితే ఈ పాటకు బాణీ కూర్చింది డిస్కో తుపానుతో హిందీ సినీ సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూపిన బప్పీలహరి అని తెలిస్తే మాత్రం పాటను మరింతగా మెచ్చుకోకుండా ఉండలేము.

అయితే పాట ఎంతగా శాస్త్రీయ సంగీతాన్ని అనుసరించినా చిత్రీకరణ సరిగ్గా లేకపోతే పాట స్థాయి పడిపోతుందని నిరూపిస్తుంది. సత్యం శివం సుందరం సినిమాలోని 'భోర్ భయే, పన్‌ఘట్ పే ' పాట.

భోర్ భయే పన్ ఘట్ పే
మోహె నట్‌ఖట్ శ్యాం సతాయే
మోరి చునరియ లిప్టీ జాయే
మై కా కరు హాయ్ రాం హాయే

సత్యం శివం సుందరంలోని అత్యంత సుందరమైన ఈపాట వినటానికి ఎంత గొప్పగా ఉంటుందో చూసేందుకు అంత జుగుప్స కలిగిస్తుంది. ఇక్కడ జుగుప్స నటి జీనత్ అమన్ వేసుకున్న ఒళ్లంతా కనిపించే దుస్తుల్లో, జలపాతం క్రింద స్నానం చేస్తూ ప్రదర్శించిన అందచందాలవల్లనోకాదు. ఎక్కడో దర్శకుడు, సంగీతదర్శకుడికి నడుమ సమన్వయం లోపించిన భావనవల్ల, ఒక చక్కని పాట, చక్కని భావం అభాసుపాలయి అసహ్యంగా ప్రదర్శితమయిందన్న భావనవల్ల జుగుప్స కలుగుతుంది. ఈపాట విన్నప్పుడు కలిగే ఆనందకరమైన భావన, తెరపై చూస్తూంటే కలగదు. ఎందుకంటే తెరపై దృష్టి నటి శరీరంపై ఉంటుంది. లత మధుర గానంపైనో, పదాలతో వర్ణితమవుతున్న శ్రీకృష్ణుడి చిలిపి శృంగారంపైనో, భైరవి రాగంనుంచి పూర్తిగా దూరమైపోయి కూడా మాధుర్యాన్ని కోల్పోని బాణీ పైననో పాటకు లయగా మోగే వాయిద్యాలపైనో ఉండదు. అంటే ఒక గొప్ప కళాసృజనను, మరో కళాకారుడు అభాసుపాలు చేశాడన్నమాట. అందుకు జుగుప్స.

నదీ ఒడ్డున ఉదయం సమయాన
అల్లరి కృష్ణుడు నన్ను వేధిస్తున్నాడు.
నా కొంగు నన్ను చుట్టుకుని పోతోంది
ఓ దేవుడా, నేనేం చేయాలి?

అత్యంత సున్నితమైన శృంగార భావనను అతి మృదువుగా కలిగిస్తోందీ పాట. ఆమెకు కృష్ణుడు ఇష్టమే. కృష్ణుడు వెంటపడి ఏడ్పించటము ఇష్టమే. కానీ దాన్ని బహిరంగంగా ఒప్పుకోవటం ఇష్టంలేదు. కృష్ణుడు తనని వేధిస్తున్నాడని మొరపెట్టుకుంటోంది. దీన్నే మరో సందర్భంలో ఓ హిందీ సినీకవి 'ఆంఖోమే ఇకరార్‌కి ఝుల్కీ, హోటోం పె ఇన్‌కార్' (కళ్లల్లో ఆమోదము, పెదవులపై ఆగ్రహము)గా వర్ణించాడు.

కొయి సాఖీ సహేలీ నహి సంగ్‌మై అకేలీ
కోయి దేఖే తొ యే జానె
పన్నియ భరనె కె బహానె
గగ్రి ఉఠాయే రాధ శ్యాంసె మిల్‌నే జాయే.

ఇదీ ఆ అమ్మాయి మొరపెట్టుకోవటానికి కారణం. ఆమె వెంట ఎవ్వరూ లేరు. ఒంటరిగా ఆమె నదికి నీళ్లు నింపుకోవటానికి వెళ్తోంది. కానీ అక్కడ కృష్ణుడున్నాడు. ఎవరైనా చూస్తే, రాధ నీళ్లు నింపే నెపంతో కృష్ణుడిని కలవటానికి నదికి వెళ్తోందని అనుకుంటారు. ఎంత సున్నితమయిన భావనను ఎంత చక్కగా వర్ణించాడు కవి! లత హొయలు, లయలు పొలికిస్తూ ఎంతో అద్భుతంగా, అత్యంత ప్రియంగా పాడిందీ పాటను. పాట లయలో నాయక ప్రతి అడుగుకూ పడే తాళం, ఆమె హృదయ స్పందనను పోలి, పాట వినేవారి హృదయాలకు 'ధక్

థక్ 'మనే హృదయలయను. అందులోని ప్రేమను, వేదనను చేరువ చేస్తుంది. కానీ తెరపై కనిపించేదేమిటి? అదీ ఈ పాట ప్రభావాన్ని పూర్తిగా నాశనం చేసిన అంశం. ఈ చిత్రీకరణ పాటల చిత్రీకరణలో ప్రామాణికాలు ఏర్పరచిన రాజ్‌కపూర్ కావటం బాధాకరం.

ఆయే పవన్ ఝుకోరా, టూటె అంగ్ అంగ్ మోరా
చోరి చోరి చుప్కే చుప్కే, బైఠా కహీ పె వో చుప్కే
దేఖె ముస్కాయె నిర్లజ్ కో లాజ్ న ఆయె, హాయే

ఈ గేయరచయిత, ఆనంద్ బక్షీ, సంగీత దర్శకుడు లక్ష్మీకాంత్ ప్యారేలాల్ లు ఎంత కష్టపడి వయ్యారంగా, హొయలు చిలికిస్తూ, ఓ వైపు అయిష్టాన్ని, మరోవైపు ఇష్టాన్ని ప్రకటిస్తూన్న యువతి అడుగుల లయను, హృదయలయతో జోడించే 'రిథం' బాణీలో పాటలోని పదాలలో తీసుకు వచ్చారో అనిపిస్తుంది. వీచే చల్లటిగాలి శరీరంలో వేదనను కలిగిస్తోంది. రహస్యంగా, ఎక్కడో, సిగ్గులేని కృష్ణుడు దాక్కుని ఉంటాడు. నన్ను చూసి వంకరగా నవ్వుతాడు. వాడికి సిగ్గయినా రాదే! అంటోంది రాధ. అద్భుతమైన శృంగార భావం. కళ్లముందు అల్లరి కృష్ణుడు, అతడు ఎక్కడ దాక్కున్నాడో అని బెదురుతూ, ఆశగా చూస్తూ, కనబడక నిరాశ చెందుతూ, అంతలోనే ప్రేమలో రగులుతూ నదికి వెళ్తున్న రాధను కళ్లముందు నిలుపుతాయి పదాలు. బాణీ దానికి ప్రాణం పోస్తుంది లత.

మై న మిలూ డగర్‌మే తొ వో చలా
మై దూం గాలి, మైదూ చిడ్కీ, మైన్ ఖోలూ బంద్ ఖిడ్కీ
నిందియా జో ఆయె తో, వో కంకర్ మార్‌కే జగాయే హాయే

దారిలో ఆమె కలవకపోతే తిన్నగా ఇంటికే వచ్చేస్తాడట. నేను అతడిని దూషిస్తాను. శాపనార్థాలు పెడతాను. కిటికీ తలుపులు ఎంత బ్రతిమిలాడినా తెరవను అని తనకి తాను చెప్పుకుంటోంది రాధ. ఒకవేళ ఆమెకి నిద్రపడితే రాళ్లు విసిరి ఆమెని నిద్రలేపుతాడట కృష్ణుడు. ఏం చేయాలి? అంటోంది.

అద్భుతం. అయితే ఈ పాట ముందు 'సాకీ' వస్తుంది. అదీ కీలకం ఈ పాటకి. పాట ఆరంభంలోనే నాయిక తనకు కృష్ణుడంటే ఇష్టం అనీ, ఆ నిజాన్ని తాను అతడి నుంచి దాచాననీ, అతడు తన ఇంటికి వచ్చిన క్షణమే తన అదృష్టం మారుతుందని పాడుతుంది. ఆ తరువాత ఇదంతా పాడుతుంది.

అత్యద్భుతమైన పాట
ఖిలీ హై ఆశాకి ఫూల్ మన్‌మే
యె రాజ్ ఉన్సే చుపాయ హమ్నే
కదం ముబారక్ హమారె దర్‌పె
నసీబ్ అప్నా జగాయ హమ్నే

ఒక సున్నితమైన శృంగార గీతం, వినటానికి ఎంత అద్భుతంగా ఉంటుందో, చూసేందుకు అంతగా ప్రభావరహితంగా చిత్రీకరించటంతో 'సత్యం శివం సుందరం 'లోని ఈపాట కానీ, టైటిల్ పాటకానీ అంతగా అలరించలేకపోయాయి. సినిమా దెబ్బ తిన్నది. అందుకే సినిమా విజయం ఏ ఒక్క కళాకారుడి వ్యక్తిగత ప్రతిభపైన ఆధారపడి ఉండదు. సినిమా కానీ పాటకానీ కళాకారుల సమిష్టి కళాప్రదర్శన ఫలితం.

Post your comments

(మరికొన్ని పాటలు వచ్చేనెలలో)